సాక్షి సూర్యాపేట

బుధవారం | 26 | జూలై | 2023



వాటర్‌ట్యాంకుతండా శోకసంద్రం

జీటెక్ విద్యార్థి మృతితో మిర్యాలగూడ మండలంలోని వాటర్‌ట్యాంకుతండా శోకసంద్రమైంది.

- 8లో



కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వలేదని..

కాంట్రాక్టర్ తనకు డబ్బులు ఇవ్వలేదని మన ఊరు–మనబడి పనులను ఓ హెచ్ ఎం అడ్డుకున్నారు.

- 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/24°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా ప్రియాంక

- హేమంత్ కేశవ్ పాటిల్ బదిలీ



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్‌గా చెక్క ప్రియాంకను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రియాంక పెద్దపల్లి (లోకల్‌బాడీస్)అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ (లోకల్ బాడీస్) అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్‌ను కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. ప్రజావాణిపై పట్టింపేది శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి అనంతరం ఫిర్యాదులపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, వీటిపై శాఖల వారీగా ఆడిటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిష్కారం చూపకపోతే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వారం రోజుల్లో పరిష్కరించకపోతే చర్యలు



తుంగతుర్తిలో గిరిజన గురుకులంలో పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తుంగతుర్తి : తుంగతుర్తిలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి ప్రిన్సిపాల్‌ను హెచ్చరించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా విషయం తెలుసుకొని మంగళవారం ఆ పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడారు.నీళ్లు కలుషితం కావడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, వాటి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రాంప్రసాద్, ఆర్‌సీఓ లక్ష్మయ్య, ఎంపీడీఓ భీంసింగ్, ఎంఈఓ లింగయ్య ఉన్నారు.

పిల్లలు, వృద్ధులను బయటికి ఒంటరిగా పంపొద్దు

సూర్యాపేట క్రైం: వర్షాలు కురుస్తున్నందున పిల్లలు, వృద్ధులను ఒంటరిగా బయటికి పంపొద్దని ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. నదిలోకి నీటి ప్రవాహంలోకి దిగ వద్దు, చేపల వేటకు వెళ్ల వద్దు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని అత్యవసర సమయాల్లో 100కు ఫోన్ చేయడం ద్వారా పోలీసు సహాయాన్ని పొందాలని కోరారు.

రూ.13.50 కోట్లతో ప్రతిపాదనలు

నడిగూడెం : సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఆర్–9 ఎత్తిపోతల పథకం నుంచి 190 సర్వే భూములకు సాగు నీరు అందించేందుకు ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి రూ.13.50 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు నీటి పారుదల శాఖ ఈఈ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 10 ఎత్తిపోతల పథకాల మరమ్మతుల కోసం రూ.15 లక్షలు, నడిగూడెం వద్ద ఉన్న ఎల్–34 ఎత్తిపోతల పథకం కాల్వలు, లైనింగ్, మోటార్ల మరమ్మతులకు రూ.15 లక్షలు అత్యవసర పనుల కింద ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ఆయన వెంట ఏఈ దుర్గయ్య ఉన్నారు.

పాఠశాలల పనివేళలు మార్చొద్దు

సూర్యాపేటటౌన్ : రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పని వేళలు మార్చుతూ విద్యాశాఖ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సోమయ్య, ఎస్.అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బడుగు బలహీన వర్గాల పిల్లల తల్లిదండ్రులు ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్తాంటారని పేర్కొన్నారు. ఆలస్యంగా ప్రారంభం అయ్యే పాఠశాలలకు తల్లిదండ్రులు తమ పిల్లలను పంపరని తెలిపారు.

అక్కడ ఇద్దరు.. ముగ్గురు

ఇక్కడ ఒక్కరూ లేరు!

- ప్రతి లోక్‌సభ స్థానంలోని రెండు అసెంబ్లీ సీట్లు బీసీలకు కేటాయించే యోచనలో కాంగ్రెస్
- భువనగిరిలో పోటీపడుతున్న బీసీ నాయకులు
- నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో బీసీ అభ్యర్థి ఎక్కడ?
- ఉమ్మడి జిల్లాలో భిన్న పరిస్థితులు
- అధిష్టానం ఏం చేస్తుందోనన్న దానిపై ఎడతెగని చర్చ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కనీసం రెండు అసెంబ్లీ స్థానాలు బీసీలకు ఇచ్చేలా ప్లాన్ చేసుకుందాం' అని ఇటీవల గాంధీ భవన్‌లో జరిగిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చెప్పిన మాట ఉమ్మడి నల్లగొండ జిల్లాకు వర్తిస్తుందా? జిల్లాలోని రెండు లోక్ సభ నియోజకవర్గాల్లో ఇద్దరు చొప్పున కనీసం నలుగురు అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి అందుబాటులో ఉంటారా? అని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. రేవంత్ చెప్పిన లెక్క భువనగిరి వరకు ఓకే అయినా.. నల్లగొండ లోక్ సభ నియోజకవర్గం పరిధిలో రెండు జనరల్ స్థానాలు బీసీలకు కేటాయించడం సాధ్యమయ్యేనా అనేది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మొదటి నుంచి అగ్రవర్ణ సామాజిక వర్గాలకు చెందిన నాయకులే ఎక్కువగా తెరపై కనిపించే నల్లగొండ కాంగ్రెస్ పార్టీలో రేవంత్ సూత్రం అమలు చేయడం అంత ఈజీ కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భువనగిరిలో అలా...!

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం విషయానికి వస్తే ఇక్కడ ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఎస్సీ రిజర్వుడు. ఐదు జనరల్ స్థానాలు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాలైన తుంగతుర్తి, నకిరేకల్ మినహాయిస్తే జనగామ నుంచి పొన్నాల లక్ష్మయ్య, ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, భువనగిరి నుంచి రామాంజనేయులుగౌడ్ పేర్లు బీసీ కోటాలో వినిపిస్తున్నాయి. మునుగోడులో పున్నా కైలాశ్‌నేత పేరు కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం ఇబ్రహీంపట్నం నుంచి మాత్రమే ఓసీ వర్గాలకు చెందిన అభ్యర్థి పేరుపై చర్చ జరుగుతోంది. అయితే, జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆలేరు నుంచి ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు, భువనగిరి నుంచి కుంభం అనిల్‌రెడ్డి పేర్లు కూడా వినిపించాయి. కానీ, అనిల్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోవడంతో ఇక్కడ రామాంజనేయులు గౌడ్‌తో పాటు మరో ప్రత్యామ్నాయంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి పెట్టనుంది. మునుగోడు నుంచి చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి పేర్లను ప్రధానంగా పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయి. అంటే భువనగిరి నియోజకవర్గంలోని ఐదు జనరల్ స్థానాల్లో నాలుగింట బీసీ, ఓసీ అభ్యర్థుల మధ్య పోటీ నెలకొందన్న మాట. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఎక్కువ మంది బీసీ అభ్యర్థుల పేర్లు వినిపిస్తుండగా.. నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో చర్చకు కూడా పెద్దగా బీసీ నేతలు కాంగ్రెస్ పార్టీలో లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో భువనగిరి నుంచి రెండు స్థానాల్లో మాత్రమే బీసీ అభ్యర్థులను నిలుపుతారా? నల్లగొండలో బీసీ అభ్యర్థి లేని పక్షంలో భువనగిరిలో ఒకటో, రెండో ఎక్కువ అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయిస్తారా? అన్నది ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

నల్లగొండలో ఇలా..!

నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో దేవరకొండ ఎస్టీ రిజర్వుడు కాగా, మిగిలిన ఆరు అన్ రిజర్వ్‌డ్ స్థానాలు. అయినప్పటికీ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పక్షాన బీసీ అభ్యర్థులు పెద్దగా కనిపించడం లేదు. 2018 ఎన్నికల్లో కేవలం మిర్యాలగూడ నుంచి మాత్రమే బీసీ అభ్యర్థిని బరిలో దింపారు. అక్కడ నుంచి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈసారి అక్కడ కూడా బీసీ అభ్యర్థి కనిపించడం లేదని కాంగ్రెస్ వర్గాలే అంటున్నాయి. నల్లగొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మిర్యాలగూడ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి లేదా జానారెడ్డి కుటుంబంలో ఒకరు, నాగార్జునసాగర్ నుంచి జానారెడ్డి, హుజూర్‌నగర్, కోదాడల నుంచి ఉత్తమ్ ఆయన సతీమణి పద్మావతి, సూర్యాపేట నుంచి దామోదర్‌రెడ్డి లేదంటే పటేల్ రమేశ్‌రెడ్డిల పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి నుంచి అసలు బీసీ అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ ఎక్కడ పోటీ పెడుతుందనేది ప్రశ్నే.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

- కలెక్టర్ వెంకట్రావు



సూర్యాపేటలో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట : జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 27 వార్డు ఆర్.కె. గార్డెన్ సమీపంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల మూసీ ఉధృతంగా ప్రవహిస్తున్నదని, వాగులు, వంకలు వర్షపునీటితో నిండు కుండలాఉన్నందున ప్రజలు, పశువుల కాపరులు వెళ్లకుండా అప్రమత్తం చేయాలని సూచించారు. భారీ వర్షాల వలన ప్రజా సమస్యలు తెలియజేసేందుకు ఇప్పటికే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నంబర్ 6281492368 అందుబాటులోకి తెచ్చినట్లు గుర్తు చేశారు. అనంతరం నూతనంగా చేపట్టిన జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామనుజుల రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సవరణను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాల వారీగా కొత్త ఓటర్ నమోదు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులపై ముఖ్య ఎన్నికల నిర్వహణ అధికారి వికాస్ రాజ్ మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్త ఓటర్ నమోదు దరఖాస్తులు 19,825 రాగా 13,346 దరఖాస్తులను, అభ్యంతరాల దరఖాస్తులు 1843 రాగా 1224 పరిశీలించామని వివరించారు. మార్పులు, చేర్పుల కింద ఫామ్ 8 దరఖాస్తులు 35,195 అందాయని వాటిలో 31,618 పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన దరఖాస్తులను ఈనెల 27వరకు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎ.వెంకట రెడ్డి, ఆర్డీఓలు సూర్యనారాయణ, జగదీశ్వర్ రెడ్డి, ఏఓ శ్రీదేవి, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలి

సూర్యాపేటటౌన్ : వర్షాకాలం వల్ల విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రంగా ఉంచాలని ఆరో స్థాయీ సంఘం చైర్ పర్సన్ బోనాల కవిత సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో ఆరవ స్థాయీ సంఘం సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తరగతి గదులు, వంట శాలలు, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.విద్యార్థులకు వేడి వేడి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 6వ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ బోనాల కవిత

ఉద్యోగుల బాధలు సీఎం కేసీఆర్‌కు తెలుసు



మాట్లాడుతున్న టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, చిత్రంలో సంఘం నాయకులు

- త్వరలోనే సీపీఎస్, ఈహెచ్ఎస్, పీఆర్‌సీపై ప్రకటన
- టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్

నల్లగొండ టౌన్ : ఉద్యమ నాయకుడిగా ఉద్యోగుల బాధలు, సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీఎన్‌జీఓ) రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్ అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా టీఎన్‌జీఓ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులకు జీతాలు ఉన్నాయని, నాలుగో తరగతి ఉద్యోగులు కూడా ఆదాయపన్ను చెల్లిస్తున్నారంటే మన స్థాయిని కేసీఆర్ ఏ స్థాయికి తీసుకుపోయారో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఉద్యోగులను కడుపులో పెట్టుకుని చూసుకుంటున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కొన్ని శక్తులు కావాలని మనలో చీలికలు తేవడానికి కుట్ర పన్నుతున్నారని వారి మాటలు వింటే మన పనులు ఎప్పటికీ జరగవన్నారు. త్వరలో ఉద్యోగుల సీపీఎస్, హెల్త్ ఇన్సూరెన్స్, పీఆర్‌సీ సీలింగ్‌పై శుభవార్తలు వినబోతామని ఆయన చెప్పారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో ఉద్యోగుల నివేదన సభను నిర్వహించి ప్రభుత్వానికి తమ సమస్యలను తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు. టీఎన్‌జీఓ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జానిమియా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్, సంఘం నాయకులు జె.శేఖర్‌రెడ్డి, దయాకర్‌రావు, ఆకునూరి లక్ష్మయ్య, వి.భాస్కర్, వెల్లంకి మాధవి, రమ్యసుధ, మేడి జయరావు, దుర్గా, జాఫర్, పి.కమల తదితరులు పాల్గొన్నారు.

వదలని వరుణుడు



మద్దిరాల మండలం గుమ్మడవెల్లిలో అలుగుపోస్తున్న చెరువు

జిల్లా అంతటా 27.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

- అత్యధికంగా చిలుకూరులో 73.3, అత్యల్పంగా మేళ్లచెరువులో 4.5 మి.మీ.
- చెరువులు, కుంటలకు జలకళ
- నేడు జిల్లాకు రెడ్ అలర్ట్



కోదాడలో భవానీనగర్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వెళ్లే దారిలో రోడ్డుపై వచ్చిన నీరు

సూర్యాపేట : జిల్లాను వర్షం వీడడంలేదు. మంగళవారం పొద్దస్తమానం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధానంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలోని ఐదు ఆరు మండలాల్లో వర్షం దంచి కొట్టింది. సగటున జిల్లా వ్యాప్తంగా 27.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చిలుకూరులో అత్యధికంగా 73.3, అత్యల్పంగా మేళ్లచెరువు మండలంలో 4.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో 14 మండలాల్లో మోస్తరు వర్షాలు పొద్దస్తమానం కురవడంతో వాగులు సాగాయి. .

జలాశయాలకు జలకళ.

రెండు రోజులుగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు సూర్యాపేట, కోదాడ హుజూర్‌గర్ నియోజకవర్గాల పరిధిలోని చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు జిల్లాలోని చిలుకూరులో 73.3, అనంతగిరిలో 73.2, నడిగూడెంలో 53.0, హుజూర్నగర్లో 47.8, ఆత్మకూర్ ఎస్ లో 38.0, మోతె 35.7, చివ్వెంల 32.8, మఠంపల్లి 30.3, గరిడేపల్లిలో 26.6, చింతలపాలెంలో 25.8, నూతనకల్ లో 25.5, పెన్ పహాడ్ లో 24.7, మునగాలలో 23.3, మద్దిరాలలో 21.9, పాలకవీడులో 16.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇక నేరేడుచర్లలో 9.9, తుంగతుర్తిలో 9.3, సూర్యాపేటలో 8.4, తిరుమలగిరిలో 7.8, నాగారంలో 7.0, జాజిరెడ్డిగూడెంలో 6.3, మేళ్లచెరువులో 4.5 మిల్లీమీటర్ల చొప్పున తేలికపాటి వర్షాలు పడ్డాయి.

భారీ వర్షాలు కురిసే అవకాశం

అల్పపీడన ప్రభావంతో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈనెల 25, 26, 27 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నెల 26వ తేదీన బుధవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలెర్ట్ ను జారీ చేసింది. జిల్లాలోని పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరింది.

కోదాడలో గంటన్నరసేపు ఎడతెరిపిలేకుండా..

కోదాడ: భారీ వర్షానికి కోదాడ తడిసి ముద్దయింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదున్నర వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 70 మిల్లీమీటర్ల వర్షం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని భవానీనగర్ నుంచి ఖమ్మం క్రాస్‌రోడ్డు వైపు వెళ్లే నాళా ఆక్రమణకు గురికావడంతో నీరు నిలిచి కాలనీ ముంపునకు గురైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు జేసీబీ తో శుభ్రం చేసి నీటిని కిందకు పంపారు. సూర్యాపేట రోడ్డులో రెడ్ చిల్లీ వెనుకవైపు రోడ్డుమీదకు నీరు చేరడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. శ్రీమన్నారాయణ కాలనీ వద్ద వాగు ఆక్రమణకు గురికావడంతో నీరు ఇళ్లల్లోకి చేరింది. ఎర్రకుంట వాగు పొంగడంతో నీరు అనంతగిరి రోడ్డు మీదుగా ప్రవహించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి కోరారు. ఇబ్బంది ఏదైనా ఉంటే యాదగిరి శానిటరీ ఇన్‌స్పెక్టర్ 83744 50353, కె. నారాయణ 79955 69076 లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



కోదాడ పట్టణంలో రెడ్ చిల్లీ వద్ద రోడ్డుమీదకు చేరిన వరద

ప్రతి విద్యార్థికీ ఆధార్ తప్పనిసరి

- స్కూళ్ల వారీగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- కొత్తగా చేరినవారికి వెంటనే కార్డులు అందించాలని నిర్ణయం
- పుస్తకాలు, యూనిఫాం, ఇతర సదుపాయాలు కల్పించేందుకే..
- ప్రక్రియను మొదలు పెట్టిన విద్యా శాఖ



చిలుకూరులో ఆధార్ దింపుతున్న ఎమ్మార్సీ సిబ్బంది (ఫైల్)

మండలాల సంఖ్య	ప్రభుత్వ పాఠశాలలు
23	1,282
మొత్తం విద్యార్థులు	ఫస్ట్‌క్లాస్‌లో చేరినవారు
1.31లక్షలు	4,000
ఆధార్‌లేని వారు 1,670 మంది	

చిలుకూరు: ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా ఆధార్ కార్డు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ఆధార్ కార్డులు లేవని గుర్తించిన ప్రభుత్వం వారికి వెంటనే ఆధార్ కార్డులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. దీంట్లో భాగంగా పాత మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాలకు గతంలో పంపిణీ చేసిన ఆధార్‌కిట్లను వినియోగంలోకి తీసుకురావాలని మండలాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వీటిలో సాఫ్ట్ వేర్ అప్‌లోడ్ చేసి మండల కేంద్రాల్లోనే క్యాంప్‌లు నిర్వహించి విద్యార్థులకు ఆధార్ కార్డులు అందించాలని సూచించింది. పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు ఇతర సదుపాయాలు కల్పించేందుకు ప్రతి విద్యార్థికి ఆధార్ నంబర్ ఉండాలి. ఈ నేపథ్యంలోనే కొత్తగా స్కూళ్లలో చేరిన పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

ప్రయోజనాలు ఇవే..

జిల్లాలోని 23 మండలాల్లో మొత్తం 1,282 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిల్లో సుమారు 1.31లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరిన నాలుగు వేల మంది వరకు ఉన్నారు. చాలామంది పిల్లలు ఆధార్‌కార్డులు లేకుండా పాఠశాలలో చేరారు. దీంతో వీరికి ప్రభుత్వ సదుపాయాలు కల్పించడం ఇబ్బందిగా మారుతోంది. దీన్ని గుర్తించిన విద్యాశాఖ మండల ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఆధార్‌కార్డులు దింపేందుకు చర్యలు చేపట్టింది. ప్రతి సంవత్సరం యూడైస్(డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఎడ్యుకేషన్)లో పాఠశాలల్లో సదుపాయాలతో పాటు విద్యార్థుల పూర్తి వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థి ఆధార్ నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరిన వారిలో 1,670 మంది విద్యార్థులకు ఆధార్ కార్డులు లేనట్లుగా గుర్తించారు. వీరిలో ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో ఎమార్సీల్లోని కిట్ల ద్వారా ఆధార్ నమోదు చేయనున్నారు. దీంతో పాటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఏమైనా మార్పులు, చేర్పులు అవసరమైతే నమోదు చేయనున్నారు. అయితే ఆధార్ నమోదుకు విద్యార్థులను ఎమ్మార్సీలకు తీసుకొచ్చి మళ్లీ పాఠశాలలకు తీసుకెళ్లే బాధ్యతను ఉపాధ్యాయులు, సీఆర్పీలకు అప్పగించారు.

సదుపాయాల కల్పనలో ఆధార్ కీలకం



ప్రతి విద్యార్థికి ఆధార్ నంబర్ ఉంటేనే ప్రభుత్వం కల్పించే పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం ఇతరర సదుపాయాలు అందుతాయి. అందుకే ఆధార్ కార్డులేని వారికి కోసం ప్రత్యేకంగా ఎమ్మార్సీ కార్యాలయాల్లో క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఆధార్ నమోదుకు ఆదేశించాం. ఇందుకోసం ఎమ్మార్సీ కార్యాలయాల్లోని కిట్లును ఉపయోగించుకోవాలని చెప్పాం. ఈ ప్రక్రియ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

18 మండలాల్లోనే కిట్లు

జిల్లాలో 23 మండలాలు ఉండగా పాత మండలాలైన 18 చోట్లలోనే ఆధార్ కిట్లు ఉన్నాయి. అవికూడా నిరుపయోగంగా మారి మూలనపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయించాల్సి ఉంది. కొత్త ఆధార్ నంబర్లు కావాలన్నా.. మార్పులు చేయించుకోవాలన్నా.. పాత మండల కేంద్రాల్లోని ఎమ్మార్సీలకు వెళ్లాల్సిందే. కొత్తవైన అనంతగిరి, నాగారం, మద్దిరాల, చింతలపాలెం, పాలకవీడు మండలాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాల్లో ఆధార్ కిట్లు లేవు. వీరంతా పక్క మండలాల్లో ఉన్న ఎమ్మార్సీ కార్యాలయాల్లోకి వెళ్లి ఆధార్ నమోదు చేయించుకోవాల్సి ఉంది. పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలంటే కొత్త మండలాలకూ కిట్లు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం... కాపర్‌వైరు చోరీ



చల్లూరులో దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

రాజాపేట : గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును చోరీ చేశారు. ఈ ఘటన రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలోని నాయినోను బావి సమీపంలో వెలుగుచూసింది. మంగళవారం గ్రేటర్ ఇన్‌ఫ్రా వెంచర్ వాచ్‌మన్ వర్కర్ అయిలయ్య దీనిని గుర్తించి పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

కంటెయినర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన బైక్

- ఒకరికి గాయాలు

చౌటుప్పల్: రోడ్డుపై అకస్మాత్తుగా బ్రేక్ వేసిన కంటెయినర్‌ను వెనుక నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి తంగడపల్లి రోడ్డులోని చెరుకుబావి కాలనీకి చెందిన రేకల వెంకటేష్(37) సోమవారం రాత్రి బైక్‌పై వలిగొండ రోడ్డు నుంచి జాతీయ రహదారి మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎదుట కంటెయినర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్‌తో కంటెయినర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి

వలిగొండ : గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు నుంచి గుర్తుతెలియని యువకుడు రైల్వేట్రాక్‌పై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

యాదాద్రిలో మహారాష్ట్ర సర్పంచ్‌ల పూజలు



యాదాద్రి కొండపైన ముల్దానా నియోజకవర్గ సర్పంచ్‌లు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని మహారాష్ట్రలోని ముల్దానా నియోజకవర్గానికి చెందిన 70మంది సర్పంచ్‌లు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. సర్పంచ్‌లకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునితామహేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న ముల్దానా సర్పంచ్‌లకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు. స్వామివారి దర్శనం అనంతరం ప్రధానాలయ పునః నిర్మాణ విశేషాలను ప్రభుత్వ విప్ గొంగిడి సునిత వారికి వివరించారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు యాదాద్రీశుడి ఆలయాన్ని సందర్శించినట్లు ముల్దానా నియోజకవర్గానికి చెందిన సర్పంచ్‌లు పేర్కొన్నారు.

వాటర్‌ట్యాంకు తండా శోకసంద్రం

- అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ ఆత్మహత్య
- స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు
- మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల రోదనలు



వ్యవసాయ క్షేత్రంలో కార్తీక్ మృతదేహాన్ని ఖననం చేస్తున్న బంధువులు

మిర్యాలగూడ టౌన్ : అనుమానాలే నిజమయ్యాయి. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చి ఐఐటీ విద్యార్థి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో ఈ నెల 17న అదృశ్యమైన ఐఐటీ విద్యార్థి కార్తీక్ బంగాళాఖాతంతో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలియడంతో మిర్యాలగూడ మండలం వాటర్‌ట్యాంకు తండా శోకసంద్రంగా మారింది. విశాఖపట్టణం నుంచి అతడి మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకురావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహం బాగా కుళ్లిపోవడంతో కొన్ని నిమిషాలే ఇంటి వద్ద ఉంచి అనంతరం వారి వ్యవసాయ పొలంలోనే అశ్రునయనాలతో ఖననం చేశారు.

మృతుడి కుటుంబానికి పలువురి పరామర్శ

ఐఐటీ విద్యార్థి కార్తీక్ చనిపోవడంతో అతడి కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు తనయుడు ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. కార్తీక్ అంత్యక్రియలు పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఉన్నారు. అతడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, బంజార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ నాయక్, సీపీఎం నాయకులు డబ్బీకార్ మల్లేష్, రవినాయక్, భద్యానాయక్, వెంకన్ననాయక్, గోపి, మక్లా, సత్యనారాయణ, సర్పంచ్ రాంచందర్ నాయక్, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, శంకర్ తదితరులున్నారు.

అన్నను చూడాలని ఉంది..

కార్తీక్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో వాటర్ ట్యాంకు తండాలోని ఇంటి వద్దకు తీసుకు రాగానే అతడి చెల్లి సాత్విక అన్నను చూడాలని ఉంది.. చూపించండి అంటూ రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. మృతదేహం ప్యాక్ చేసి ఉండటంతో కుటుంబ సభ్యులు చివరి చూపు చూడలేకపోయారు. మనుమడు అదృశ్యం అయినప్పటి నుంచి నాయనమ్మ అన్నం, నీళ్లు ముట్టకపోవడంతో సొమ్మసిల్లింది. తాత వాలు అయ్యా ఒక్క ముద్ద తిందువు రా అంటూ అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.



కంటతడి పెట్టుకుంటున్న కార్తీక్ చెల్లెలు సాత్విక

కొడుకా..కొడుకా..

కార్తీక్ మృతదేహాన్ని ఖననం చేసేందుకు వారి వ్యవసాయ పొలం వద్దకు తరలిస్తుంటే తల్లి సైదమ్మ తల్లడిల్లిపోయింది. కొడుకా.. కొడుకా అంటూ అంబులెన్స్ వెంట పరుగెడుతుంటే చూసిన వారందరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. 'నేనేమిజేస్తిని దేవుడా కడుపు కోత మిగిల్చావు' అంటూ గుండెలవిసేలా రోదించింది.



సొమ్మసిల్లిన కార్తీక్ నాయనమ్మ ధర్మి



కార్తీక్ తండ్రి ఉమ్లానాయక్‌ను ఓదారుస్తున్న ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నలమోతు సిద్ధార్థ



కార్తీక్ ఇంటి వద్ద గుమిగూడిన తండావాసులు, బంధువులు

కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వలేదని..



కూలీలతో ఇనుపచువ్వలు చుట్టిస్తున్న కాంట్రాక్టర్



బయట పడవేసిన ఇనుప చువ్వలు

- 'మన ఊరు–మన బడి' పనులు అడ్డుకున్న ప్రధానోపాధ్యాయురాలు
- న్యాయం చేయాలని డీఈఓ, పోలీసులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు

చివ్వెంల(సూర్యాపేట) : కాంట్రాక్టర్ తనకు డబ్బులు ఇవ్వలేదని మన ఊరు–మనబడి పనులను ఓ ప్రాధానోపాధ్యాయురాలు అడ్డుకుంది. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగింది. కాంట్రాక్టర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదు నెలల క్రితం టెండర్ ద్వారా పాఠశాలలో మన ఊరు–మన బడి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్ నాగు నాయక్ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. పాఠశాలలో డైనింగ్ హాల్, నీటి నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో పనులు చేపడుతుండగా సబంధిత పాఠశాల హెచ్‌ఎం రమణ తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు కాంట్రాక్టర్ ఆరోపించాడు. దీంతో తన వద్ద లేవని తానే ఇబ్బందుల్లో ఉన్నానని తెలిపానని పేర్కొన్నాడు. అయినా అడుగుతుండటంతో నెల రోజుల క్రితం జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. సోమవారం మధ్యాహ్న సమయంలో పాఠశాలలో పనులు చేస్తుండగా వర్షం కురవడంతో ఇంటికి వెళ్లానని, వచ్చి చూసే సరికి ఐరన్ చువ్వలు బయట వేసి గుంతలు పూడ్చివేశారని ఆవేదనవ్యక్తం చేశాడు. పాఠశాల విద్యార్థులను అడుగగా హెచ్‌ఎం తొలగించమంటే తామే తొలగించామని చెప్పారన్నారు. దీంతో హెచ్‌ఎంను అడుగగా ఇక్కడ వద్దు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నారని వాపోయాడు. దీంతో జిల్లా విద్యాధికారితో పాటు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టర్ తెలిపాడు. ఈ విషయమై హెచ్‌ఎం రమణను వివరణ కోరగా తాను ఐరన్ చువ్వలు తొలగించలేదని, ఎవరు తొలగించారో తనకు తెలియదన్నారు. కాంట్రాక్టర్‌ను డబ్బులు అడిగానని వస్తున్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ప్రధానోపాధ్యాయురాలు అన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత

భువనగిరి : పోయిన సెల్‌ఫోన్లను పోలీసులు మంగళవారం బాధితులకు అప్పగించారు. ఈ నెల 2వ తేదీన రాగాల శ్రీనివాస్ తన సెల్ ఫోన్ భువనగిరి బస్టాండ్‌లో పోయిందని ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మొబైల్ ఐఎంఈఐ ఆధారంగా ఈ నెల 24న సెల్ ఫోన్‌ను పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించారు. ఈ నెలలోనే పోగొట్టుకున్న మరో రెండు సెల్ ఫోన్లను కూడా బాధితులకు అప్పగించినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

వివాహిత అదృశ్యం



సరిత (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : వివాహిత అదృశ్యమైంది. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కోటపహాడ్ గ్రామానికి చెందిన మద్దెల నాగరాజు భార్య మద్దెల సరిత ఈ నెల 23న సూర్యాపేటలోని మాంటిస్సోరి స్కూల్‌లో చదువుతున్న పిల్లలను చూసేందుకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో నాగరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన మహిళకు 2010లో నాగరాజుతో వివాహం జరగ్గా.. ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కనీస వేతనం అమలు చేయాలి

నల్లగొండ : కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఆయన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో ప్రసూతి సెలవులు కల్పించాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎక్స్ గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి దార వెంకన్న, పగిడిపాటి ప్రవీణ్, భిక్షమాచారి, ఎండి హమీనుద్దీన్, చౌడోజు శ్రీధర్, కొంపెల్లి రమేష్, రాజు, శ్రీను, సతీష్, రవీందర్, భాగ్యలక్ష్మి, మంజుల, సంధ్యరాణి, మాధవి, రాధ, నాగమణి పాల్గొన్నారు.

బావిలో పడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి



వేణు (ఫైల్)

కేతేపల్లి: ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయ బావిలో బోల్తా కొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన బరిశెట్టి వేణు(35)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో నాట్లు వేసేందుకు మంగళవారం సాయంత్రం వేణు ట్రాక్టర్‌తో పొలం దున్ని ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇరుకైన మట్టి రోడ్డు మీదుగా వస్తుండగా మార్గమధ్యలో వ్యవసాయ బావి పక్కనే ఉన్న బురద గుంటలో ట్రాక్టర్ దిగబడి పోయింది. గ్రామంలోకి వెళ్లిన వేణు దిగబడిన ట్రాక్టర్‌ను బయటికి లాగేందుకు మరో ట్రాక్టర్ తీసుకువచ్చాడు. ముందు ఉన్న ట్రాక్టర్‌కు తాడుకట్టి బయటికి లాగే ప్రయత్నంలో భాగంగా వేణు దిగబడిన ట్రాక్టర్ ఎక్సలేటర్‌ను గట్టిగా తొక్కాడు. దీంతో ట్రాక్టర్ ఒక్కసారిగా పైకిలేచి దారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయింది. ట్రాక్టర్ తిరగబడటంతో డ్రైవింగ్ చేస్తున్న వేణుపై ట్రాక్టర్ పడి ఊపిరాడక మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



బావిలో పడిన ట్రాక్టర్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి సవ్వళ్లగూడెం స్టేజీ సమీపాన జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయిటిపాముల గ్రామానికి చెందిన తొమ్మిది మంది మహిళలు నార్కట్‌పల్లి రాశీ ఫ్యాక్టరీలో పని ముగించుకొని ఆటోలో స్వగ్రామం బయలుదేరారు. సవ్వళ్లగూడెం వద్దకు రాగానే ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు ఆటో బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దావూద్‌తో పాటు మరో ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అదే సమయంలో వెనక నుంచి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒకరికి తీవ్రగాయాలు..

మునగాల: జాతీయ రహదారిపై మండలంలోని ఇందిరానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మూకల చినవీరయ్య మంగళవారం రాత్రి బైక్‌పై స్వగ్రామం వస్తుండగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన జాలి తగలడంతో కుడికాలుకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం కోదాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

'మైహోం'లో ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కోదాడ డీఎస్పీ

- శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షించాలని కార్మికుల వినతి

హుజూర్‌నగర్: మేళ్లచెరువు పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం జరిగిన స్థలాన్ని మంగళవారం కోదాడ డీఎస్పీ ప్రకాష్ పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన స్థలంలో పడిపోయిన శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షించాలని విన్నవించుకున్నారు. ఇప్పటికే శిథిలాల కింద పరిశీలించామని, ఎవరూ లేరని నిర్ధారించుకున్నామని డీఎస్పీ తెలిపారు. జేసీబీ తెప్పించి శిథిలాల కింద ఎవరైనా ఉంటే రక్షిస్తామని, ఎవరూ భయపడవద్దని వారికి హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు శాంతించారు.



శిథిలాల వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ ప్రకాష్

లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

నల్లగొండ క్రైం, రామగిరి(నల్లగొండ): దివ్యాంగురాలిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ మహిళా కోర్టు న్యాయమూర్తి బి.తిరుపతి మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..పుట్టుకతో మానసిక దివ్యాంగురాలైన(30) మహిళ నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశా వెనుక గల శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటోంది.ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆమెపై పక్క ఇంట్లో ఉంటున్న చిందాల సుధీర్‌కుమార్ అలియాస్ బాబురావు కన్నుపడింది. ఓ రోజు ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో మాయ మాటలు చెప్పి దివ్యాంగురాలైన మహిళను తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో సుధీర్‌కుమార్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ హేళన చేశాడు. దీంతో బాధితులు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2021 డిసెంబర్ 31న ఫిర్యాదు చేశారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐలు బాలగోపాల్, గోపి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకట్‌రమణారెడ్డి వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి నిందితుడికి సెక్షన్ 376 (ఎల్) ప్రకారం పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

మూసీలో వ్యక్తి మృతదేహం లభ్యం



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు పరిధిలో గల మూసీలో మంగళవారం 50 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదారు రోజులుగా మూసీ వరదతో పాటు భారీగా డెక్కాకు కొట్టుకొని వచ్చి జూలూరు–రుద్రవెల్లి గ్రామాల మధ్య ఉన్న మూసీ లోలెవల్‌బ్రిడ్జి వద్ద చేరింది. బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన గుర్రపుడెక్కాకు తొలగించేందుకు మంగళవారం మధ్యాహ్నం అధికారులు జేసీబీ సహాయంతో పనులకు ఉపక్రమించారు. ఈ క్రమంలో గుర్రపుడెక్కాకులో చిక్కుకొన్న వ్యక్తి మృతదేహం కన్పించింది. దాంతో డ్రైవర్ అక్కడే బందోబస్తులో ఉన్న పోలీస్‌కానిస్టేబల్‌కు విషయం చెప్పాడు. అనంతరం జేసీబీ సహాయంతో ఆ మృతదేహాన్ని మూసీలో నుంచి బయటికి తీశారు. అయితే మృతదేహం కుళ్లినస్థితిలో ఉండటంతో సంఘటన స్థలంలోనే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.



మృతుడి జేబులో దొరికిన పాన్‌కార్డు

బెంగళూరుకు చెందిన వ్యక్తిగా గుర్తింపు..

షర్ట్, బనియన్ లేకుండా కేవలం నల్ల ప్యాంటు ధరించి నడుముకు మొలదారం కట్టి ఉండటంతో ఎలాంటి అనవాళ్లు దొరకక మొదట పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా భావించారు. పోస్టుమార్టం చేసే ముందు ప్యాంటును తొలగించగా లోపలి జేబులో ఆ వ్యక్తికి సంబంధించి ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు లభ్యమయ్యాయి. గఆధార్‌కార్డు ద్వారా అతని పేరు మున్నంగి శ్రీనివాస్‌రెడ్డి, ఫ్లాట్‌నంబర్ సీ1, వినాయక మెడోస్, చిక్క బన్వాడి, కల్యాణ్‌నగర్, బెంగళూరు అడ్రస్ ఉంది. అలాగే జేబులో దొరికిన ఫోన్‌నంబర్ ఆధారంగా పోలీసులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడంలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అయితే శ్రీనివాస్‌రెడ్డి ప్రమాదవశాత్తు మూసీలో జారిపడ్డాడా లేదా, ఆత్మహత్య చేసుకొన్నాడా అనేది తెలియాల్సి ఉంది. మృతదేహం కుళ్లి చర్మం ఊడిపోయే స్థితిలో ఉండటంతో ఇతను నాలుగైదు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

యాదాద్రి జిల్లాలో లంకె బిందెలు లభ్యం?



అధికారులు స్వాధీనం చేసుకొన్న ఖాళీ బిందెలు ఇవే

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలో వ్యవసాయ పొలం వద్ద మట్టి తవ్వుతుండగా నాలుగు లంకెబిందెలు దొరికినట్లు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన పది రోజుల క్రితం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి మంగళవారం సంఘటన స్థలాన్ని సందర్శించి గ్రామంలో విచారించారు. బాధ్యులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి పంచనామా నిర్వహించారు. దొరికిన బిందెలను స్వాధీనం చేసుకున్నారు. పురావస్తు శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగిస్తామని తహసీల్దార్ వీరాభాయి తెలిపారు.

ఖాళీబిందెలా.. లంకె బిందెలా..!

10 రోజుల క్రితం గ్రామానికి చెందిన రైతు కొలను బాల్‌రెడ్డి గ్రామ సమీపంలోని తుమ్మల చెరువు సమీపంలో ఉన్న పట్టాభూమిలో జేసీబీతో మట్టిని తవ్విస్తున్నాడు. ఈ క్రమంలో మట్టితో పాటు 4 బిందెలు బయటపడ్డాయి. జేసీబీ డ్రైవర్ పర్వతం నవీన్‌తో పాటు అక్కడే ఉన్న మక్త అనంతారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు సురేశ్, ధన్‌రాజ్‌లు చూశారు. నవీన్ ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు, మీకు మద్యం తాగడానికి డబ్బులు ఇస్తానని చెప్పి పంపించాడు. అనంతరం నవీన్ ఆ బిందెలను ఇంటికి తీసుకెళ్లాడు. డబ్బుల విషయమై నవీన్‌కు ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో వారు నాలుగు రోజుల తరువాత గ్రామంలో బిందెలు దొరికిన విషయం తెలిసినవారికి చెప్పారు. ఈ విషయం కాస్తా ఆ నోట, ఈ నోట బయటకు పొక్కడంతో వెలుగులోకి వచ్చింది. స్థానికంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా వైరల్ చేశారు. ఈ విషయం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే బాధితుడిని ప్రశ్నించగా ఖాళీబిందెలు మాత్రమే దొరకాయని అందులో ఏమీలేవని చెబుతున్నాడు. ఏమీలేక పోతే బిందెలు దొరికిన వెంటనే గ్రామస్తులకు , అధికారులకు గానీ చెప్పకుండా ఎందుకు గోప్యంగా ఉంచారనేది పలు అనుమానాలకు తావిస్తోంది. దొరికినవి ఖాళీ బిందెలా, లంకె బిందెలా అనేది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది.

వేర్వేరు చోట్ల వర్షానికి కూలిన ఇళ్లు



బొమ్మలరామారం : కూలిన ఇంటి వద్ద మల్లమ్మ



మునుగోడు : కొరటికల్‌లో గోడ కూలడంతో ధ్వంసమైన వంట సామగ్రి

బొమ్మలరామారం : కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షం కారణంగా గ్రామాల్లోని పాత గృహాలు పూర్తిగా నాని కూలిపోతున్నాయి. బొమ్మలరామారం, మునుగోడు, మోత్కూ రు, గట్టుప్పల్ మండలాల పరిధిలో మంగళవారం పలు ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. బొమ్మలరామారం మండలం జలాల్‌పూర్‌లో మోటే మల్లమ్మ, రామలింగంపల్లి గ్రామంలోని ఊదరి యాదగిరిల ఇళ్లు కూలిపోయాయి. తహసీల్దారు పద్మ సుందరి ఎంఆర్‌ఐ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలాలను పరిశీలించారు. కూలిపోయిన ఇళ్లను పరిశీలించి జరిగిన నష్టం విలువను అంచన వేశామని తహసీల్దారు తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. నిరాశ్రయులైన బాధితులకు ఆదుకోవాలని సర్పంచ్‌లు సంగిశెట్టి వెంకటేష్, యాంజాల కళ ప్రభుత్వాన్ని కోరారు.

కొరటికల్‌లో కూలిన ఇంటి గోడ

మునుగోడు: వారం రోజులుగా కురుస్తున్న ముసురికి మండలంలోని కొరటికల్ గ్రామంలో కాశిమల్ల లింగయ్య ఇంటి గోడ కూలింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అతని కుటుంబానికి ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మోత్కూరులో..

మోత్కూరు : ఇటీవల కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ కేంద్రంలోని ఓ ఇల్లు మంగళవారం సాయంత్రం కూలింది. మున్సిపల్ కేంద్రంలోని గడిబజార్‌లో ఉన్న చిలుకమర్రి రాములుకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు నాని కూలిపోయింది.

గట్టుప్పల్‌లో..

చండూరు(గట్టుప్పల్) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన మొద్దు తిరుపతయ్య పూరి గుడిసె గోడ మంగళవారం రాత్రి కూలింది. తిరుపతయ్య కుటుంబం రోజు వారీ కూలీలుగా పని చేస్తుంటారు. తమను ఆదుకోవాలని అధికారులను తిరుపతయ్య కోరాడు.

పత్తి పండించే రైతులు జాగ్రత్తలు పాటించాలి



మాచారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తల బృందం

పెన్‌పహాడ్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పత్తి పంట సాగు చేసే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి. లవకుమార్, శాస్త్రవేత్తలు డి. నరేష్, డి. ఆదర్శ్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని మాచారం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను వారు సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అధిక వర్షాల వలన పత్తి పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. నీరు నిల్వ ఉంటే మొక్కలు కుళ్లిపోయి చనిపోయే ఆస్కారం ఉందన్నారు. అలాంటి లక్షణాలు గమనించినప్పుడు ట్రికోడెర్మా 5మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్క వేర్ల దగ్గర పోయాలని సూచించారు. పత్తి పంట త్వరగా కోలుకోవటానికి నీటిలో కరిగే ఎరువులు అయిన (19:19:19) లేదా మల్టీ–కే(13:00:45)లేదా యూరియా 10గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రసం పీల్చే పురుగులు, పేనుబంక, పచ్చదోమ వంటివి గమనించినట్లయితే వాటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.2గ్రా. లేదా అసిఫేట్ 1.5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్, రైతులు బంటు రాములు, కేశవులు, విద్యార్థులు గోవర్ధన్, అజయ్, రాజు, సుజాన్ తదితరులు పాల్గొన్నారు.